


# మేల్కొన్న మానవత్వం

సున్నా అచ్యుతరావు
వేమకోటి సీతారామశాస్త్రి

లోకం నిద్రాదేవి ఒడిలో పరవశ మౌతోంది.

అర్ధరాత్రి సమయం. కారు చీకటి. చీకటిలో చిన్న కొవ్వొత్తి దీపం. చిన్న గుడిసె. ఆకాశంలో చుక్కలు దీనంగా వెలుగుతున్నాయి. గుడిసెలో పదిమంది గూడుపుఠాణీ చేసుకుంటున్నారు! గుసగుసలు పడుతున్నారు. వారి మధ్యనో పెద్దమనిషి ఏమిటో చెబుతున్నాడు. నాగస్వరానికి పరవశమైపోయిన సర్పాల్లా వారు శ్రద్ధగా వింటున్నారు. ప్రతివాడి కళ్ళల్లో ఎరుపుదనం, అందులో చిన్న దీపకళిక చిరుగాలితో ఆడుకుంటూ, కాంతిని చిందర వందర చేస్తోంది.

కోర మీసాలు మెలివేస్తూ గన్నారెడ్డి నవ్వాడు విజయం వరించిన వీరునిలా! క్రౌర్యాన్ని కౌగిలించుకుని, కల్మషాన్ని పూసుకొని వెడల గక్కిన విషజ్వాలలా వుందా నవ్వు!

గన్నారెడ్డి, తెచ్చిన లెదర్ సూట్ కేసును కాలు విరిగిన టేబిలు మీద పెట్టాడు. మీదన ఉట్టి ఉరిత్రాడులా వ్రేలాడుతోంది.

అక్కడున్న వాళ్ళందరికీ వరుసగా గన్నారెడ్డి డబ్బు ఇస్తున్నాడు. డబ్బు తీసుకుంటూ, ఆ దోసిలితోనే దండం పెట్టి ఒకొక్కరే బయటకు వచ్చేస్తున్నారు.

యాదగిరి వంతు వచ్చింది.

"యాదగిరీ! ఇపుడు నీవు చేయాల్సిన పని గుర్తుంది కదూ?" గన్నారెడ్డి హెచ్చరించాడు.

"ఆ! గుర్తుంది!" అన్నాడు యాదగిరి వినయంగా వంగి. అతని దోసిట్లో రెండు వందల రూపాయల కట్టలు పడ్డాయి.

విప్లవ జ్వాల వ్యక్తమయ్యేవాడి నల్లటి ముఖంలో గర్వం, కృతజ్ఞతా కలసిన చిరునవ్వు ఒక క్షణం మెరుపులా మెరిసింది.

గన్నారెడ్డి వెనకనే గుడిసెలో నుండి యాదగిరి బయటకు వచ్చేశాడు. క్షణంలో విమానం లాంటి కారు ముందుకు కదిలింది, గతుకులతో అస్తవ్యస్తమైన రోడ్డు మీద.

కటిక చీకటిలో యాదగిరి వంటరిగా మిగిలిపోయాడు.

క్షణం ఆగి, ఆరిపోయిన బీడీ ముట్టించి బయలుదేరాడు. బీడీలోని అగ్గి రవ్వ ఆశ చివరి కాంక్షలా; ఎర్రగా వెలిగిపోతూ బీడీని కాల్చేస్తూ నుసిచేస్తోంది!

వీధులన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. రోడ్డు మీద రాళ్ళు, పగిలిపోయిన గాజు పెంకులు, రక్తం మరకలు, కాలిపోయిన వస్తువులు, చెత్తా చెదారంతో శ్మశానంలా వున్నాయి నగరంలోని వీధులు. ఎక్కడ చూసినా దైన్యం తాండవిస్తున్నది.

కటిక చీకటిలో బాణంలా దూసుకు పోతున్నాడు యాదగిరి.

పచ్చని అనాబ్‌షాహే ద్రాక్ష తోటలు, ఏపుగా పెరిగిన పంట పొలాలు, వాటి దగ్గర్లోనే పెంకుటిల్లు....ఇవన్నీ తన కిచ్చినట్లు, హాయిగా అనుభవిస్తూ, సుఖంగా బ్రతకమని ఎవరో ఆదేశిస్తున్నట్లుగా యాదగిరి హృదయం ఆనందంతో పరవశించిపోతోంది. ఆశల వలలో చేపలా వాడి మనసు గిలగిల కొట్టుకుంటోంది, కలలు గనే గుండెతో పాటు!

గర్వం, అహంకారంతో చెలిమి జేస్తే విజయం గతాన్ని గుర్తు చేసింది.

తాను ఎన్నో ఇళ్ళు ధ్వంసం చేశాడు. ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్లు, రైలు పెట్టెలు, బస్సులు తగల పెట్టాడు. రైలు పట్టాలు పీకేశాడు. షాపులు సరేసరి. ఎపుడు పడితే




అపుడు తన సహచరులతో దండయాత్ర చేశాడు. లారీలు, బస్సులు వాడి చేతుల్లో ఆట వస్తువులై పోయాయి. అంతెందుకు, మధ్యాహ్నం ఒక మనిషిమీద కిరసనాయిలు పోసి తాను తగలబెట్టాడు.

స్వార్థంలాంటి నాగుపాము యాదగిరిని విపరీతంగా కాటువేసింది! ఇంకా ఏవేవో చేయాలి. అంతా తనకు, తన వాళ్ళకు శాశ్వతమై పోవాలి! ఆశల పల్లకీకి అరాచకాల తోరణాలు కట్టి, హింసల బాజా భజంత్రీలతో గన్నారెడ్డి ఊరేగిస్తున్నాడు. రెడ్డికి మనసులోనే దండం బెట్టాడు యాదగిరి.

యాదగిరి నడుస్తున్నాడు....దు రా శ ల కుంపటి మీద!

జీవిస్తున్నాడు భగభగమండే ఆశల కోరికల మధ్య!!

ఎక్కడో ఆకాశంలో చుక్కలు వెలవెలబోతున్నాయి. వాడి కళ్ళల్లోని రక్తపు జీరలు చీకట్లో దారిని వెదుక్కుంటున్నాయి.

నెలరోజుల క్రితం తల్లికి బాగులేదని పల్లెగ్రాం వస్తే, విశాఖపట్నం ఎలక్ట్రిసిటీ డిపార్ట్ మెంట్ లో ఉద్యోగం చేస్తున్నతను ఇక్కడికి వచ్చేశాడు వెంటనే. కాని తాను వచ్చేటప్పటికే అంతా అయిపోయింది. చివరి చూపులు కూడా దక్కకుండా పోయాయి తనకు.

అప్పటినుండీ మరి తాను విశాఖపట్నం వెళ్ళలేదు.

యాదగిరి ఒక దుకాణం దగ్గర ఆగిపోయాడు. తలుపు తట్టాడు. ఎంత సేపటికీ సమాధానం రాకపోయే సరికి, మళ్ళీ దబదబా బాదాడు.

"కౌన్ హై?" లోపలనుంచి సన్నగా కీచుమన్న కంఠం.

"నేను, యాదగిరిని!" నెమ్మదిగా అన్నాడు. సగం పగిలిన అద్దం తలుపు కిర్రుమంది. కొడి గట్టిన దీపం వెలుగు మరింత పెద్దదయింది. అద్దాల బీరువాలో నుండి సీసా వచ్చింది. డబ్బు చెల్లించి అక్కడే త్రాగేశాడు. స్తబ్దమైన వాడి ఆలోచనలకు అప్పటికి గాని చలనం రాలేదు. వేడెక్కిన మస్తిష్కం అడుగులు ముందుకు వేయిస్తోంది. ఆ నడక, అలా కొన్ని పూరి గుడిసెల మధ్య ఆగిపోయింది. అదో లేబర్ కోలనీ. నాగరికతకు దూరంగా వుంటోంది. అక్కడున్న వాళ్ళంతా ఇతర ప్రాంతాలనుండి పొట్ట చేత్తో పట్టుకుని జీవించడానికి వచ్చిన వాళ్ళే నివసిస్తున్నారు ఎక్కువగా.

కోలనీ నిశ్శబ్దంగా వుంది. యాదగిరి చుట్టూ చూశాడు. జనసంచారం లేదు. ఎక్కడో కుక్క మూలుగు వినిపించింది. గాలిదేవుడు ఆ మూలుగుతో స్నేహం చేశాడు. జేబులో, పాలిథీన్ కవర్లో పెట్టిన గుడ్డలను తీశాడు యాదగిరి.

అంతే!....మరుక్షణంలో గుడిసెలు అంటుకున్నాయి! వాడ వాడంతా ఒక్కసారి మేల్కొంది, హాహాకారాలతో!!

"మంటలు! నీళ్లు....నీళ్లు" అంటున్నారెవరో. కేకలు, ఆక్రందనలు లేచిన మంటలతో మిన్నుముట్ట సాగాయి. క్షణం క్రితం చీకటిని, సుషుప్తావస్థను మంటలు వేటాడుతున్నాయి.

ఇంతలో "అడుగో! గుండా పట్టుకోండి!" అన్నారెవరో.

గుంపులో కొందరు తన వేపు పరుగెత్తుకు రావడం చూశాడు యాదగిరి. వాడి గుండెలు భయంతో విలవిల లాడాయి. తాను దొరికితే ఇంకేముంది! కాళ్లు, చేతులు కట్టి మంటల్లో పడేస్తారు అనుకున్నాడు. కాలి బలం కొద్దీ పరుగుతీశాడు. వెంట తరుముతున్నవారు కూడా పరుగెత్తసాగారు, టార్చిలైటు సహాయంతో.

యాదగిరి రైలు కట్టదగ్గర వాళ్ళ కన్నుగప్పేశాడు. గూడ్సు రైలు తాను కట్టదాటగానే ఝూమ్మంటూ వచ్చేసింది. ఇంతలో తాను తప్పించుకున్నాడు అదృష్టవశాత్తు. అయినా తనను భయం విడవలేదు. ఏ క్షణంలోనైనా వాళ్ళు రావచ్చనుకున్నాడు.

యాదగిరి వళ్ళంతా రక్కుకు పోయింది. మోచేతులనుండి రక్తం కారుతోంది. దాహంతో నాలుక పిడచకట్టుకు పోతోంది! సందడి అణిగే వరకూ ఎక్కడైనా తలదాచుకోవాలి! ఊహలాంటి ఆశ కలిగింది. దూరంగా ఒక గుడ్డిదీపం కన్పించింది. నీరసంగా, వెళ్ళాడు రొప్పుతూ.

గుడిసె తడిక కొంచెం తెరిచే వుంది. చుట్టు ప్రక్కల చూశాడు. ఎవ్వరూ రావడం కన్పించలేదు. మెల్లగా గుడిసె లోపలికి వెళ్ళాడు.

నిశ్చేష్టుడయ్యాడు.

అక్కడో ఫోటో. దానికి దండవేసి వుంది. కొంచెం దూరంలో మట్టి ప్రమిదతో దీపం పెట్టబడి వుంది. దానికి కొద్ది దూరంలోనే ఒకామె నిస్త్రాణంగా, తడికకు చెరబడి దీనంగా, విచారంగా, పిచ్చిగా చూస్తూ కూర్చుంది. ఆమె ప్రక్కగా ముగ్గురు పిల్లలు నిద్రపోతున్నారు.

"ఎవరన్నా?" ఆమె కంఠస్వరం నూతిలో నుండి బయటకు వచ్చినట్లుగా వుంది. జ్ఞాపక తరంగాల్ని తాకినట్టుగా వుంది.

"నే ను...నేనే...గూండాలనుండి తప్పించుకుని వచ్చానిక్కడికి, దాహమేసి" అన్నాడు యాదగిరి నీరసంగా కూలబడిపోతూ! వళ్ళంతా మంటలు మండిపోతోంది. ఎదురుగా చిన్న అద్దంలో, చివిరి గెడ్డంతో తన నీరసించిన ముఖం వెలవెల బోతున్నది, అబద్ధం మంటల మధ్య మాడిపోతూ!

ఆమె లేచి గ్లాసుతో నీళ్ళు తెచ్చింది. తీరని దాహంతో తపిస్తున్న యాదగిరికి ఆ నీరు అమృతంలా పెదాల కందింది. కృతజ్ఞతతో ఆమె కళ్ళల్లోకి చూశాడు. ఆమె బుగ్గలనిండా కన్నీటి చారలు వున్నాయి. ముఖం వాడిపోయివుంది. పెదిమ క్రింద పెద్ద పుట్టుమచ్చ—ఆమె....ఆమె మాణిక్యం!.... యాదగిరి మస్తిష్కంలో జ్ఞాపకాలు వెనక్కు వెళ్ళాయి.

*                    *

పది సంపత్సరాల క్రితం....అదుపూ, ఆజ్ఞ లేకుండా పెరిగిన తాను, దొంగతనం చేసి రాజమండ్రి పరారై పోయాడు. అక్కడ కాఫీ హోటళ్ళలో కప్పులు కడిగాడు. అదీ గిట్టుబాటు కాక జేబు దొంగతనాలు చేశాడు. జీవితంలో ఏదో అనుభవించాలనిపించేది. కోర్కెలు కోరలు సాచేవి.

ఒకనాడు జేబు దొంగతనంచేసి సినిమా హాలు వద్ద పట్టుబడిపోయాడు. చావు దెబ్బలు తిని చైతన్యం లేక పడిపోతే, ఒక రిక్షాలాగే ముసిలాడు వాళ్ళింటికి తీసుకెళ్ళి తన ప్రాణం రక్షించాడు. అతని పేరు అప్పలస్వామి. అక్కడికక్కడే తనకు ఒళ్లు తెలియని జర్వం వచ్చేసింది. చావు బ్రతుకుల అంచులమీద ఊగిస లాడింది తన జీవితం.

రిక్షా అప్పలస్వామి కూతురు మాణిక్యం.


తండ్రీ కూతుళ్ళు ఇద్దరు ఎంతో సేవ చేసి తనను మృత్యు ముఖనుండి తప్పించారు. అప్పటి నుండీ తన జీవిత విధానం మారిపోయింది. తన జీవితంలో ఊహించని మార్పు వచ్చింది. మాణిక్యం చూపిన సోదర భావం, అభిమానంతో తాను పునీతుడైయ్యాడు. తన అలవాట్లు మార్చుకున్నాడు. రక్త సంబంధంకన్నా అతీతమైన మాణిక్యం ప్రేమ తనను పూర్తిగా మార్చివేసింది.



ఎలక్ట్రికల్ ఇంజనీరుగా ర మ్మా యి ని అప్పలస్వామి రోజూ రిక్షాలో తీసుకెడుతుండేవాడు. ఆ పరిచయంతో ఇంజనీరుగారితో చెప్పి, బ్రతిమలాడి ఉద్యోగం ఇప్పించాడు. కొంతకాలం మక్కడ వుద్యోగం చేసి శ్రీకాకుళం ట్రాన్స్ఫరయ్యాడు.

యాదగిరి వెళ్ళిపోతూ, రాజమండ్రి స్టేషన్లో రైలు కదులుతూంటే తన కాశ్రయమిచ్చిన దేవతలకు కృతజ్ఞతతో నమస్కరించాడు. మాణిక్యం కళ్లు గోదావరు లైయ్యాయి.

అశ్రుసిక్త నయనాలతో, మమతా పూరిత హృదయాలతో ఆనాడు వారిచ్చిన వీడ్కోలు జ్ఞాపకమే తనకు మిగిలి పోయింది!




ఆ తర్వాత సంవత్సరానికి, మళ్ళీ ఆ వూరు వెడితే అప్పలస్వామి రిక్షా యాక్సిడెంట్‌లో చనిపోయాడనీ, మాణిక్యాన్ని ఎవరో బంధువులు తీసి కెళ్ళారని ఇరుగు పొరుగులు చెప్పారు. తర్వాత మాణిక్యం జాడే తెలియ లేదు.

మళ్ళీ ఈనాడు....జ్ఞాపకాల దొంతర్ల మధ్య....మాణిక్యం....యాదగిరి గతంనుండి వర్తమానంలోకి వచ్చాడు.

* *

"సెల్లీ!....మాణిక్కెం!—" అన్నాడు యాదగిరి ఆనందంగా.

మందంగా వెలుగుతున్న దీపం వెలుతుర్లో ఆమె యాదగిరిని గుర్తించలేక పోయింది.

"నేనే.... సెల్లీ!...యాదగిరిని!'!' అన్నాడు మళ్ళీ.

"నువ్వా....అన్నా!" అంది మాణిక్యం సంభ్రమాశ్చర్యాలతో.

"ఇన్నాళ్ళా మేము నీకు గుర్తు రాలేదా అన్నా?" అంది మాణిక్యం గాద్గదిక స్వరంతో మళ్ళీ.

"ఒచ్చాను సెల్లీ! నీ వెక్కడి కెళ్ళి పోయావో జాడే తెలియలేదు" అన్నాడు యాదగిరి కృశించిన ఆమెను చూస్తూ. తరలి పోతున్న జీవితంలోయాదగిరికి అప్పటి జ్ఞాపకాలే మిగిలాయి.

"ఏందీ రగతం? దెబ్బలు తగిలాయా?" చీర కొంగుతో మోచేతుల మీద రక్తాన్ని తుడిచింది మాణిక్యం.

బాధతో మూలిగాడు యాదగిరి.

చంటిది మూడేళ్ళ పిల్ల పలవరింత వినగానే త్రుళ్ళి పడి పిల్ల దగ్గరకు వెళ్ళింది మాణిక్యం.

"అమ్మా! అయ్య కావాలే!" పిల్ల పలవరిస్తోంది.

"వస్తాడమ్మా! అయ్య మిఠాయిలుకోసం యెళ్ళాడు" అంటూ మాణిక్యం ఓదారుస్తోంది.

"అమ్మా! రేపు దీపావళిగదే! అయ్య ఇంకెపుడు తెస్తాడమ్మా కొత్త బట్టలు?" పెద్దవాడు లేచి సగం నిద్రలోనే ప్రశ్నించాడు. భోరున యేడ్చేసింది మాణిక్యం.

"ఏంది, మావా? ఏం సెప్పమంటావ్?.... ఈ పసిపిల్లలకు? నన్న న్నాయం సేసెళ్ళి పోయావ్. మాకు దిక్కేంటి మావా!" అంటూ మాణిక్యం వెక్కి వెక్కి యేడవ సాగింది ముందున్న ఫోటో వేపు చూస్తూ.

యాదగిరి నెమ్మదిగా లేచి ఓదార్చుదామని దగ్గరకు వెళ్ళాడు. ఫోటోలో పువ్వుల దండల మధ్య చిరునవ్వు ముఖంతో తన వేపు చూస్తున్నట్లుగా వుంది. ఆ దీపం వెలుగులో....అదే చూపు....మధ్యాహ్నం....ఎక్కడో చూసినట్లుగా గుర్తు....ఒక్కసారిగా త్రుళ్ళి పడ్డాడు యాదగిరి! నోటమాట రాలేదు. దూరంగా రైలు గొంతు చించుకుంటూ కదిలిపోతున్న శబ్దం! తన కాళ్ళ క్రింద భూమి కంపిస్తున్నట్లుగా....ఎక్కడో భూమి తిరుగుతున్నట్లుగా తల తిరిగి పోసాగింది.

"ఓరన్నా....సూడరా! మీ బావ....మావా! మీ బావమ్మర్ది వచ్చాడు. అన్నా!....మీ బావ మీద పెట్రోలు పోసి కాల్చేశారు పేక్టరీ దగ్గర!" అంది మాణిక్యం భోరున ఏడుస్తూ. ఆ ఆక్రందనకు పిల్లలు లేచి తల్లిని చుట్టుకొని బావురు మన్నారు. యాదగిరి కన్నీటి తెర ఆ దృశ్యాన్ని కప్పేసింది.

"అన్నా! నా పిల్లలు దిక్కులే నోళ్ళయ్యారు. మా రెక్కల కష్టంతో బ్రతుకుతున్నాం. మే మెవరికీ అన్యాయం సేయలేదు. కాని....కాని... "

యాదగిరి మరి వినలేకపోయాడు. ఆదృశ్యం తన కళ్ళముందే మెదుల్తోంది. మాణిక్యం మొగుడి మీదే కిర్సనాయిలు పోసి నిప్పంటించాడా తాను. అతను బాధతో పెనుగులాడటం తా నింకా ఇపుడే చూసినట్లుంది!

బాధ! పాపం!! పశ్చాత్తాపం!!! యాదగిరి భయంకరమైన హృదయాన్ని కాల్చేస్తున్నాయి.

అనుకోకుండా జేబులో మూలుగుతున్న నోట్ల కట్టలు తీసి మాణిక్యం ప్రక్కన పెట్టాడు యాదగిరి.

"సెల్లి!" అంటూ మాణిక్కెం తలమీద చెయ్యి వేశాడు.

"నివ్విక్కడనుండి మీ వూ రెళ్ళి పో" అన్నాడు బాధగా.

"ఏడకెళ్ళి పోతామన్నా? యాడైనా బ్రతుకు బుగ్గయ్యేవరకూ కాయకష్టం చేసి పిల్లల్ని సాకాలి కదా!....నువ్వ సెల్లి కింత అండగా వుంటే సాలు!" అంది మాణిక్యం కన్నీళ్ళు వత్తుకుంటూ.

యాదగిరి మాట్లాడలేదు.

"రేపొద్దున్నొస్తానే సెల్లీ!" అంటూ పిల్లల్ని ముద్దాడి బయల్దేరాడు యాదగిరి.

గుమ్మంవరకూ వచ్చిన మాణిక్యం "రేపొద్దున్న నీకోసం సూస్తుంటానన్నో" అంది భవిష్యత్తుపై ఆశలుంచుతూ.

"అలాగే!" క్రూరత్వం, దారుణత్వం నశించి పశ్చాత్తాపం చిగురిస్తున్న యాదగిరి నీరసమైన గొంతు పలికింది.

మనస్సులోనే "భగవాన్! నన్ను క్షమించు" అనుకున్నాడు, దయ్యం జుట్టులా విరబోసుకున్న చీకట్లోకి నడిచిపోతూ.

——:o:——